
ప్రజాశక్తి

శనివారం 11 నవంబర్ 2023 | 5 | విజయనగరం



ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14,17 విభాగంలో జిల్లా అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్వి రమణ శుక్రవారం ప్రారంభించారు. పరుగు, లాంగ్ జంప్, హై జంప్, డిస్కస్త్రో 100, 400, 800 మీటర్ల పరుగు పందెం, హర్డిల్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు.



పరుగు పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

ఇజ్రాయిల్ దాడులపై నిరసనలు

పాలస్తీనాకు మద్దతుగా నిలవాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని



శృంగవరపుకోట... ఆందోళన చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని, నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పాలస్తీనా, గాజాలపై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యాన జిల్లాలో పలు చోట్ల శుక్రవారం ఆందోళనలు చేపట్టారు. శృంగవరపుకోట పట్టణంలోని ఆర్టిసి కాంప్లెక్స్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ గాజాపై నెల రోజులుగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే ఆపాలన్నారు. ఈ దాడుల మూలంగా వేలాది మంది పిల్లలు, వృద్ధులు, మహిళలు మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమస్య పరిష్కారానికి మానవతా దృక్పథంతో ఇతర దేశాలతో పాటు ఇండియా కూడా ముందుకు రాకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఐక్యరాజ్య సమితి చేసిన సూచనలను కూడా లెక్కచెయ్యకుండా దాడులు కొనసాగించడం అమానవీయమన్నారు. ఇజ్రాయిల్ దాడులు ఆపేలా ప్రధాని మోడీ కృషి చేయాలని, పాలస్తీనాకు మద్దతుగా నిలవాలని కోరారు. అమెరికా, జర్మనీ, బ్రిటన్.. ఇజ్రాయిల్‌ను రెచ్చగొట్టే ధోరణిని విడనాడాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, నాయకులు చెలికాని ముత్యాలు, శంకర్, ఎస్ఎఫ్ఐ నాయకులు హర్ష, క్వారీ యూనియన్ నాయకులు వై.భాస్కర్, పి.భాస్కర్ పాల్గొన్నారు.

విజయనగరంటౌన్ : పాలస్తీనా, గాజా పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, సిపిఐ నాయకులు నాగభూషన్ ఖండించారు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా తన ఆధిపత్యం కోసం పాలస్తీనా, ఇజ్రాయిల్ దేశాల మధ్య జాత్యహంకార చిచ్చు రేపి యుద్ధానికి ఆద్యం పోసిందన్నారు. చిన్న పిల్లలను మహిళలను కూడా విడిచిపెట్టకుండా శరణార్థ శిబిరాల వద్ద బాంబుల వర్షం కురిపించి ప్రాణాలతీసేందుకు ఇజ్రాయిల్ కారణమైందన్నారు .ఈ దుశ్చర్యను ప్రపంచ దేశాలు ఐక్యరాజ్యసమితి కూడా ఖండిస్తున్న భారత ప్రధాని నోరు విప్పకపోవడం దారుణం అన్నారు కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి. రమణమ్మ, ఎ.జగన్మోహన్, రామమోహన్, బి.రమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేష్, రామ్మోహన్, సిపిఐ నాయకులు రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని సిపిఎం మండల కార్యదర్శి బలస శ్రీను, సిపిఐ నాయకులు అలమండ ఆనంద రావు ఆధ్వర్యాన స్థానిక ఆర్టిసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

గజపతినగరం : గజపతినగరంలో వామపక్షాల ఆధ్వర్యాన మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్ మాట్లాడుతూ పాలస్తీనాకు మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, నాయకులు రాకోటి రాములు, సిపిఐ నాయకులు అప్పారావు, అప్పలనాయుడు, ఈశ్వరరావు, కనకరాజు, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు

బొబ్బిలి : పట్టణంలో దక్షిణ దేవుడి వద్ద వామపక్షాల ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకర్రావు మాట్లాడుతూ ఇజ్రాయిల్‌కు ప్రధాని మోడీ మద్దతు ఇవ్వడాన్ని ప్రజలందరూ ఖండించాలని కోరారు. పాలస్తీనా, గాజాలపై ఇజ్రాయిల్ దాడులు చేస్తూ వేలాది మంది ప్రాణాలు బలిగొంటోందని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎం.శ్రీనివాసరావు, పట్టణ కళాసీ సంఘం అడబాల అప్పారావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.







గజపతినగరం, బొబ్బిలి, విజయనగరంలో నిరసన తెలుపుతున్న మపక్షాల నాయకులు, కార్యకర్తలు

పక్కాగా ఓటర్ల జాబితా

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఎటువంటి తప్పులూ లేకుండా, అత్యంత పకడ్బందీగా ఓటర్ల జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆర్‌డిఒలు, వివిధ మండలాల తాహశీల్దార్లతో శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా, మండలాల వారీగా ఓటర్ల జాబితా సవరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అక్టోబరు 31వరకు వచ్చిన క్లైయిములన్నిటినీ పది రోజుల్లో విచారణ జరపాలని చెప్పారు. ఫారమ్ 6 సుమారు 5,100, ఫారం ఏడు 4668, ఫారమ్ 8 లు 1569 పెండింగ్ ఉన్నాయని చెప్పారు. క్లైయిములు పెండింగ్ ఉండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో పెండింగ్‌లో ఉన్న క్లైయిములు మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. వెంటవెంటనే కంప్యూటర్‌లో ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఒకే డోర్ నెంబరుతో ఉన్న ఓట్లు, ఒకే ఇంటిలో పదికి పైగా ఉన్న ఓట్లపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి, విచారణ జరపాలని ఆదేశించారు. పై పోర్షన్, ప్రక్కపోర్షన్‌లో ఉంటున్నవారికి వేరే డోర్ నంబరు కేటాయించాలని సూచించారు. ఓటు తొలగించేముందు తప్పనిసరిగా నోటీసు ఇవ్వాలని స్పష్టం చేశారు. యువ ఓటర్లపై దృష్టి పెట్టాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని ఆదేశించారు. కళాశాలల్లో చదువుతున్న ఒక్క విద్యార్థిని కూడా వదలకుండా ఓటుహక్కు కల్పించాలని చెప్పారు. ఓటర్లలో సుమారుగా 3.5 శాతం మంది 18 లేదా 19 ఏళ్ల వారు ఉంటారని, ఈ నిష్పత్తి ప్రకారం మన జిల్లాలో యువ ఓటర్లు ఉన్నదీ లేనిదీ తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, నియోజకవర్గ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

హెల్త్ అలవెన్స్ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికులకు హెల్త్ అలవెన్సు బకాయిలు చెల్లించాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యాలయానికి వస్తున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావును అడ్డుకున్నారు. 3 నెలల హెల్త్ అలవెన్స్ బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని నిలదీశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగన్మోహన్ రావు మాట్లాడుతూ 2021లో జనవరి, 2022లో సెప్టెంబర్, 2023 లో అక్టోబర్ నెల హెల్త్ అలవెన్సులు బకాయిలు ఉన్నాయని, గత కొంతకాలంగా ఇవ్వాలని అడుగుతుంటే అధికారులు స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని టెక్నికల్ సమస్య ఇక్కడే ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. తక్షణమే హెల్త్ అలవెన్సే చెల్లించాలని లేని, లేనియెడల ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పైడిరాజు,రామారావు, సూరి,వంశీ, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్స్ కోసం

అయ్యప్పనగర్ వాసుల ఆందోళన

- రహదారిపై బైఠాయింపు
- పాలకులు,అధికారుల తీరుపై మండిపడ్డ పిపిఎస్ఎస్ నాయకులు
- బలవంతంగా అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్







పిపిఎస్ఎస్ నాయకులు రెడ్డి శంకరరావు, యుఎస్ రవికుమార్, జగన్మోహనరావును అరెస్టు చేస్తున్న పోలీసులు

నగరంలోని అయ్యప్ప నగర్ నుంచి ప్రధాన రహదారిపైకి వచ్చే చోట స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పాలకొండ, విజయనగరం రహదారిపై పట్టణపౌరసంక్షేమ సంఘం నాయకులు, స్థానికులు బైఠాయించారు. అక్కడ స్పీడ్ బ్రేకర్ లేనందున నెలరోజుల్లో ముగ్గురు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారని, అయినా అధికారుల్లో చలనం లేదని అన్నారు. ఇంకెంత మంది ప్రాణాలు కోల్పోవాలని, స్పీడ్‌బ్రేకర్లు ఎందుకు వేయరని ప్రశ్నించారు. అధికారులు వచ్చి సమాధానం చెప్పాలని, అంతవరకు కదిలేది లేదని భీష్మించారు. వాహన రాకపోకలు నిలిచిపోవడంతో రెండవ పట్టణ స్టేషన్ పోలీసులు వచ్చి ఆందోళన చేస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులను, అయ్యప్పనగర్ వాసులను బలవంతంగా ఈడ్చుకెళ్ళి అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, యుఎస్ రవికుమార్ మాట్లాడుతూ గత రెండేళ్లగా స్పీడ్ బ్రేకర్స్ వేయాలని అనేక మార్లు అధికారులకు వినతి పత్రాలు సమర్పించామన్నారు. చివరికి ఎమ్మెల్యేకోలగట్ల వీరభద్రస్వామి కాలనీకి వచ్చి తమ ముందే మున్సిపల్ డిఇకి చెప్పినా అధికారుల్లో స్పందన లేదన్నారు. దీంతో స్పందన కార్యక్రమంలో జెసి కి వినతి పత్రం సమర్పించామన్నారు. జెసి మున్సిపల్ అధికారులను పిలచి మాట్లాడి రెండు రోజుల్లో అయ్యప్ప నగర్, హనుమాన్ నగర్, పాలిటెక్నిక్ కాలేజీ వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని చెప్పారన్నారు. అయినా ఇంతవరకు అధికారులు స్పీడ్‌బ్రేకర్లు వేయకపోవడం వల్ల గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగి పలువురు గాయపడి ఆస్పత్రిలో చేరారని తెలిపారు. అధికార్లు వెంటనే అయ్యప్ప నగర్ మెయిన్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు వేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో. ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ, సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, అధ్యక్షుడు ఎ.జగన్ మోహన్, అయ్యప్ప నగర్ అసోసియేషన్స్ కార్య దర్శి ఎన్. సుదీర్, ప్రసాద్ , చౌదరి, నారాయణరావు , అయ్యప్ప నగర్ ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

సామాజిక సాధికార యాత్రలో మంత్రులు ధర్మాన, బూడి, రాజన్నదొర



సభలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు, పంచాయతీరాజ్‌శాఖామంత్రి బూడి ముత్యాలునాయుడు, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. వైసిపి చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర శుక్రవారం పార్వతీపురంలో జరిగింది. తొలుత సీతానగరం మండలంలోని లచ్చయ్యపేట నుంచి ప్రారంభమైన బస్సుయాత్రకు వైసిపి కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ద్విచక్ర వాహనాల ర్యాలీతో పార్వతీపురం చేరుకున్నారు. అనంతరం పాతబస్టాండ్‌లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ఎవరి ప్రమేయం, ఎవరి ప్రోద్బలం లేకుండా అర్హత ఒక్కటే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకూ, మెరుగుదలకూ ఉద్దేశించి చేస్తున్న పథకాల నిర్వహణను అర్థం చేసుకుని, వాటితో ముడిపడి ఉన్న ఆర్థిక ప్రయోజనాలు కన్నా సామాజిక ప్రయోజనాలను గుర్తించాలన్నారు. ఇదీ టిడిపికి, వైసిపి ప్రభుత్వానికీ ఉన్న తేడా అని అన్నారు. ఊరూరా తిరిగి ప్రజల కష్ట నష్టాలు గుర్తించి పాదయాత్రలో చెప్పినవన్నీ చేసిన ఏకైక నాయకులు వైయస్ జగన్ అని చెప్పారు. 2014 ఎన్నికల వేళ తమకు ఓటు వేస్తే ఇవి చేస్తాం అవి చేస్తే అని చెప్పి చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. రైతులను, మహిళా సంఘాలను, అన్ని వర్గాలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. విద్యాభివృద్ధి కోసమే నాడు-నేడు పథకాన్ని జగన్ తీసుకొచ్చారని తెలిపారు. ఏ కారణంతోనూ పేదల చదువు అర్ధాంతరంగా ఆగిపోకూడదని భావించి, రకరకాలుగా వారికి ప్రోత్సాహం అందిస్తున్నామని వివరించారు.

అట్టడుగు వర్గాలకు అండగా : రాజన్న దొర

విద్య, వైద్యం, వ్యవసాయంలో విప్లవాత్మక చర్యలు చేపట్టిన ఘనత సిఎం జగన్‌దని ఉపముఖ్యమంత్రి రాజన్నదొర అన్నారు. గతంలో లంచం లేనిదే పని జరిగేది కాదని, కానీ నేడు ప్రతిదీ ఇంటికే వస్తుందని, కాబట్టి ప్రజలు ఈ రెండు ప్రభుత్వాల మధ్య ఉన్న తేడాను గమనించాలని కోరారు. పేద వర్గాలంటే అట్టడుగునే ఉండాలనే స్థితిని మార్చారని తెలిపారు. అంబేద్కర్, పూలే, కొమరం భీమ్, అల్లూరి సీతారామరాజు ఆశయాలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజల కల అయిన పార్వతీపురం మన్యం జిల్లాను వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు.

మంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలకు, మైనార్టీలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత వైసిపికే దక్కుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో కల్లబొల్లి కబుర్లు చెప్పి టిడిపి నాయకులు ఓట్లు అడిగేందుకు వస్తారని, వారి మాటలు నమ్మవద్దని అన్నారు. కార్యక్రమంలో ఎంపీలు బెల్లాన చంద్రశేఖర్, గొట్టేటి మాధవి, ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడారు. వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, విశ్వసరాయి కళావతి, శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎస్‌సి కమిషన్ సభ్యురాలు సవరపు జయమణి, ఎమ్మెల్సీ పాలవలస శ్రీకాంత్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్, గిరిజన కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ స్వాతి రాణీ, దాసరి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ రమాదేవి, నియోజక వర్గం పరిశీలకులు శోభాహైమావతి, జెడ్‌పి మాజీ చైర్మన్ చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు

పార్వతీపురం నియోజక వర్గ నాయకులు బోను గౌరీశ్వరి, ఇండుపూరు గున్నేష్, కొండపల్లి రుక్మిణీ, జెడ్‌పటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



ఇ-ఆఫీసుపై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్

డిసిసిబిలో ఇ-ఆఫీసు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఇ-ఆఫీసును శుక్రవారం ప్రారంభించారు. బ్యాంకు ప్రధాన కార్యాలయం సమావేశ భవనంలో ఇ-ఆఫీసుపై కలెక్టరేట్‌లోని ఎన్ఐసికి చెందిన రిసోర్స్ పర్సన్స్ బాలకృష్ణ, శంకర్ బ్యాంకు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిసిసిబి సిఇఒ కెంబూరు జనార్ధన మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలను సకాలంలో పారదర్శకంగా అందించేందుకు ఇ-ఆఫీసు ప్రారంభించామని చెప్పారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా విజయనగరం డిసిసిబిలోనే ఇ- ఆఫీసు ప్రారంభమైందని అన్నారు. ఇకనుంచి జిల్లాలోని అన్ని డిసిసిబి బ్రాంచ్‌ల్లో ఇ-ఫైలింగ్ అమలు జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఆప్కాబ్ జనరల్ మేనేజర్ , డిసిసిబి ఒఎస్‌డి జిఎస్ఎన్ రాజు, జనరల్ మేనేజర్లు కెవివిఆర్ఎన్ సత్యనారాయణ, సిహెచ్ ఉమామహేశ్వరరావు, డిసిఎంలు బిఎస్ఎస్ ప్రసాద్, రామకృష్ణ, లక్ష్మణరావు, పివిఎస్ రామారావు, ఎంజిఎంలు రామ్మోహన్, శ్రీనివాసులనాయుడు, మేనేజర్లు పాల్గొన్నారు.

పట్టణ సమస్యల పరిష్కారానికి నిధులు లేవా?

ప్రజాశక్తి-బొబ్బిలి

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు నిధులు కేటాయించిన ప్రభుత్వం పట్టణ అభివృద్ధికి నిధులు ఎందుకు కేటాయించడం లేదని పిసిసి సభ్యులు ముచ్చల శ్రీనివాసరావు ప్రశ్నించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేసిన స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో గోతుల రోడ్లు, తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని ప్రభుత్వం, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు నిధులు కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. రోడ్లు బాగు చేయాలని, తాగునీరు నిరంతరాయంగా సరఫరా చేసేందుకు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తాగునీటికి కష్టాలు

ప్రజాశక్తి-బొబ్బిలి



తెర్లాం.. టెక్కలివలసలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీటి కోసం పట్టణ ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. పురాతన పైపులైన్ కావడంతో ఎక్కడికక్కడే లీకవడంతో తాగునీరు సరఫరా చేసేందుకు మున్సిపల్ అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో గొల్లపల్లి, పాతబొబ్బిలి, అమ్మిగారికోనేరుగట్టు, మరికొన్ని ప్రాంతాలకు ఆరు రోజులుగా తాగునీరు అందడం లేదు. దీంతో తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో చేతిపంపు బోర్లు నీరు వినియోగిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన, మున్సిపల్ ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నారు. మున్సిపల్ యంత్రాంగం స్పందించి తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొమిరిలో తాగునీరు వృథా



వృథాగా పోతున్న తాగునీరు

రేగిడి : మండలంలోని కొమిరి గ్రామంలో దళిత కాలనీలో వేల లీటర్ల తాగునీరు వృథాగా పోతోంది. దీంతో శివారు వీధులకు తాగునీరు అందక గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొడ్డవలస వద్ద నాగావళిలో 49 కోట్ల రూపాయలతో ఏర్పాటుచేసిన పైలెట్ ప్రాజెక్టు నుంచి వచ్చే తాగునీరు వృథాగా పోవడంతో పలు గ్రామాలకు కూడా నీరు అందని పరిస్థితి నెలకొంది. గ్రామంలో కొళాయి నుంచి రోజంతా నీరు వృథా కావడంతో సిసి రోడ్డుపై ప్రవహించి నాచు పట్టి దోమలకు నిలయంగా మారింది. మూడు నెలలుగా నీటి వృథాపై సచివాలయ ఉద్యోగులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సచివాలయ కార్యదర్శి స్పందించి, తాగునీటి వృథాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టెక్కలివలసలో దాహం కేకలు

తెర్లాం : మండలంలో పెరుమాలి పంచాయతీ పరిధిలోని టెక్కలివలసలో నెల రోజుల నుంచి తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. దీంతో శుక్రవారం ట్యాంకు సమీపంలో రోడ్డుపై మహిళలు ఖాళీ బిందెలతో బైఠాయించారు. కుళాయిల ద్వారా నీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా, మోటారు వైండింగ్ కాలిపోయిందని చెప్పారు. స్థానిక సర్పంచ్‌కు చెప్పామని, త్వరలో మోటార్ బాగు చేయించి నీరందిస్తామని ఆయన వివరణ ఇచ్చారు.

లాంగ్ జంప్‌లో లక్ష్మికి బంగారు పతకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



బంగారు పతకం సాధించిన లక్ష్మి

తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరుగుతున్న 38 వ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన జి.లక్ష్మి బంగారు పతకం సాధించింది .లాంగ్ జంప్‌లో 6 మీటర్లు జంప్ చేసి పతకం సాధించింది. ఈ సందర్భంగా ఆమెను అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

పోలీసు కార్యాలయంలో స్పందన రద్దు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని నవంబరు 13న రద్దు చేసినట్లుగా జిల్లా ఎస్‌పి ఎం. దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నవంబరు 13న దీపావళి పండగ సందర్భంగా సెలవుగా పరిగణిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆరోజు నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లుగా తెలిపారు.

డేవిడ్ మృతి తీరనిలోటు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు, విజయవాడ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డేవిడ్ అకాల మరణం మున్సిపల్ కార్మిక ఉద్యమానికి తీరని లోటని ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగన్మోహన్‌రావు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం వ్యక్తం చేశారు. డేవిడ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు, పర్మినెంట్, సమాన పనికి సమాన వేతనం కోసం ఐక్యంగా పోరాటం చేయడం ద్వారానే డేవిడ్ ఆశయ స్ఫూర్తిని కొనసాగించగలమని పిలుపునిచ్చారు. నివాళులర్పించిన వారిలో రామారావు, సూరి, పైడ్రాజు, గౌరీ, వంశీ తదితరులు పాల్గొన్నారు



రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైన తేజేశ్వరరావుకు అవార్డు అందిస్తున్న డిఇఒ

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు కాగితాపల్లి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని కాగితాపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి తేజేశ్వరరావు ఏర్పాటు చేసిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయులు ఆర్.సుధాకర్ తెలిపారు. ఈ నెల 9న విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి ఎన్‌సిఎస్‌సి వైజ్ఞానిక ప్రదర్శనలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు గొర్లె రమేష్ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థి దూబ తేజేశ్వరరావు ప్రదర్శించిన డెంగీ నివారణలో మొక్కల ప్రమేయం అనే ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి లభించింది. దీంతో డిఇఒ లింగేశ్వరరెడ్డి ప్రశంసా పత్రం, అవార్డు అందించారు. అవార్డు రావడం పట్ల విద్యార్థి తేజేశ్వరరావును, ఉపాధ్యాయులు రమేష్‌ను ఎంఇఒలు వరప్రసాదరావు, ఎరకయ్య అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తిప్పలవలస విద్యార్థి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని తిప్పలవలస ఉన్నత పాఠశాల విద్యార్థిని నాయన లీలవేణి ఎంపికైనట్లు హెచ్‌ఎం కెవిఎన్ మూర్తి తెలిపారు. విద్యార్థినితోపాటు పిఇటి అవ్వలనాయుడును హెచ్‌ఎం అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన లీలవేణిని అభినందిస్తున్న హెచ్‌ఎం

అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. జీవ వైవిధ్య సంరక్షణ రాయబారి కార్యక్రమం గురించి రీజనల్ బయోడైవర్సిటీ కోఆర్డినేటర్ బి.జానకిరావు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పట్నాయక్, తహశీల్దార్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్ల లక్ష్యాలను అధిగమించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో ఆస్తిపన్ను, కుళాయి పన్ను వసూలు చేసి లక్ష్యాలను అధిగమించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 ఏడాదికి సంబంధించిన ఆస్తిపన్ను, కుళాయి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతనంగా నిర్మిస్తున్న ఇళ్ల ప్లాన్లను పరిశీలించాలని, మున్సిపల్ ప్లాన్లకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్ఒ ప్రసాద్, టిపిఎస్ వరప్రసాద్, ఆర్ఐ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా

ప్రజాశక్తి-వేపాడ

ఓటర్ల జాబితాను తప్పుల్లేకుండా పక్కాగా తయారు చేయాలని డిప్యూటీ తహశీల్దార్ సన్యాసినాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్ఒలతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీ సమయంలో వాలంటీర్ల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. ఏ ఒక్కరు తప్పు చేసినా చర్యలు తప్పవన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి స్వచ్ఛమైన ఓటరు జాబితాను తయారు చేయడంతోపాటు పంచాయతీ కార్యదర్శి సహకారం తీసుకోవాలని సూచించారు.

మిరాకిల్‌లో ఓటు హక్కుపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని మిరాకిల్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రెవెన్యూ అధికారులు ఓటు హక్కుపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. తహశీల్దార్ బంగార్రాజు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తెలిపారు. మీ భాగస్వామ్యంతో ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. విద్యార్థులకు ఫారం- 6 ఇచ్చి ఓటర్లుగా నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఒ పూర్ణిమ

వ్యవసాయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక వైకెపి కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం చైర్మన్ జమ్ము అప్పలనాయుడు ఆధ్వర్యాన నిర్వహించారు. సమావేశంలో ఎఒ ఎం.పూర్ణిమ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ధాన్యం తేమ 17 శాతం లోపు ఉండాలన్నారు. మద్దతు ధర క్వింటాకు సాధారణ రకం రూ.2183, ఏ గ్రేడ్ రూ.2203గా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. జిపిఎస్ అమర్చిన వాహనాల్లో మాత్రమే ధాన్యం మిల్లులకు పంపించనున్నట్లు తెలిపారు. ధాన్యం రవాణా చేయాలనుకున్న రైతులు తమ ట్రాక్టర్లు, వాహనాలకు జిపిఎస్ అమర్చుకోవడానికి రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో ఉద్యానశాఖాధికారి, నీటిపారుదల ఎఇ, ఎఇఒ, సభ్యులు పాల్గొన్నారు.

72 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వావిలపాడు సచివాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో 72 మందికి వైద్యులు ధరణి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి భాగ్యలక్ష్మి, ఎఎన్ఎం బీబీ, హెచ్ఎ సి.సుధానాయుడు, డిఇఒ మోహన్, సతీష్ పాల్గొన్నారు.

కార్యనిర్వాహక అధ్యక్షులుగా దామోదర్

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆంధ్ర కొప్పల వెలమ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులుగా రెడ్డి దామోదర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భ:గా దామోదర్‌ను కొప్పల వెలమ సంక్షేమ సంఘం నాయకులు ఎం.అప్పారావు, కె.సత్యనారాయణ, తదితరులు అభినందించారు.

సంక్షేమ పాలన మాతోనే సాధ్యం

ఎమ్మెల్యేలు బడ్డుకొండ, కడుబండి



వేపాడ.. నాయకులు, కార్యకర్తలతో కలిసి రోడ్డుపై టిఫిన్ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రజా సంక్షేమ పాలన వైసిపితోనే సాధ్యమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని నాలుగో వార్డులో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. అనంతరం రెల్లివీధిలో రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ ప్రారంభించారు. 7వ సచివాలయంలో వివిధ సంక్షేమ పథకాలను తెలియజేస్తూ ఏర్పాటు చేసిన బోర్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే... సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురేష్‌బాబు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, వైసిపి పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు మద్దిల వాసు, జానా ప్రసాద్, నౌపాడ శ్రీనివాసరావు, ఎఎంసి డైరెక్టర్ పొలుబోతు నారాయణమూర్తి, కమిషనరు పి.బాలాజీ ప్రసాద్ పాల్గొన్నారు.

భోగాపురం : వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచేది తానేనని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ధీమా వ్యక్తంచేశారు. భోగాపురంలోని సచివాలయం-2 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్ని పార్టీలు కలిసినా, తాను చేసిన అభివృద్ధి తనను గెలిపిస్తుందని అన్నారు. వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, నాయకులు పడాల శ్రీనివాసరావు, పడాల భాను, సుందర హరీష్ మాట్లాడుతూ మన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యేను ముచ్చటగా మూడోసారి కూడా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, ఎంపిటిసి కొయ్య సంతోషి, మాజీ ఉప సర్పంచ్ కొమ్మూరి శుభోషణరావు, ఉదయబాబు, సర్పంచులు బైరెడ్డి రాజు, పైడినాయుడు, నూకరాజు, ఇఒ రామకృష్ణ తదితరులు



బాడంగి.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న జెడ్‌పిటిసి రామారావు, మరిపి శంకరరావు



నెల్లిమర్ల.. డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

పాల్గొన్నారు.

బాడంగి : బాడంగిలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జెసిఎస్ మండల కన్వీనర్ మరిపి శంకరరావు, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు ఆధ్వర్యాన కార్యక్రమాన్ని చేపట్టారు.

రామభద్రపురం : రామభద్రపురం సచివాలయం-1 పరిధిలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు ఆధ్వర్యాన అన్నారు. ఎందుకు రాష్ట్రానికి జగనే కావాలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు అప్పికొండ లక్ష్మునాయుడు, జెసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, సచివాలయ కన్వీనర్ కర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో బొద్దాం సచివాలయంలో వై ఎపి నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని ఎంపిపి సత్యవంతుడు ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి అప్పారావు, పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ, ఎఎంసి చైర్‌పర్సన్ కస్తూరి, వైసిపి మండల అధ్యక్షులు జగన్నాథం, సర్పంచ్ రామ సత్యవతి పాల్గొన్నారు.

వేపాడలో నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరయ్యారు. రోడ్డుపై ఉన్న టి కొట్టు వద్ద అల్పాహారం తీసుకున్నారు. బక్కునాయుడుపేట వెళ్లి ప్రభుత్వ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.అర్జునమ్మ, ఎంపిటిసి గాడి గంగతల్లి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు ఎన్.వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్టుకు విశేష స్పందన

ప్రజాశక్తి-విజయనగరం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టుకు విశేష స్పందన లభించింది. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోగల ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన ఈ పరీక్షకు సుమారు 20వేల మంది విద్యార్థులు హాజరయ్యారని జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవిఎన్ వెంకటరావు, రమణప్రభాత్ తెలిపారు. పాఠశాల స్థాయిలో జరిగిన టాలెంట్ టెస్టులో 8,9,10 తరగతుల నుంచి ప్రథమస్థానంలో వచ్చిన వారిని మండలస్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. మండలస్థాయి టాలెంట్ టెస్టు ఈనెల 30న, జిల్లా స్థాయిలో డిసెంబర్ 17, రాష్ట్రస్థాయిలో జనవరి 27,28 తేదీల్లో జరుగుతుందని తెలిపారు.

భోగాపురం : స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 8,9,10 తరగతులకు చెందిన సుమారు వంద మంది విద్యార్థులు చెకుముకి టాలెంట్ టెస్టు రాశారు. తొలుత ప్రధానోపాధ్యాయులు పిఎజిహెచ్ఎస్ శ్రీనివాసరావు, సైన్సు ఉపాధ్యాయులు కె.నాగలక్ష్మి, ఎం.శ్రీనివాస్, ఎస్.శ్రీదేవి చెకుముకి పరీక్షా పత్రాన్ని ఆవిష్కరించారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యం

బొబ్బిలి : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన చెకుముకి పోటీలు నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా ఉపాధ్యక్షులు పి.సత్యంనాయుడు తెలిపారు. ప్రపంచ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నియోజకవర్గ పరిధిలోని బొబ్బిలి మండలం, పట్టణం, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల్లో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం ప్రశ్నించే లక్షణాలను కలిగి ఉండాలని, అన్ని పనులకు శాస్త్రీయతే కీలకమైనదని అన్నారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం వచ్చిన విద్యార్థులు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో 5 వేల మంది విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్నారని తెలిపారు. బొబ్బిలి మండలం, పట్టణంలో 22 పాఠశాలల నుండి 2 వేల మంది పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో జెవివి నాయకులు ఆనెం శ్రీనివాస్, శంబంగి శ్రీనివాస్, కృష్ణదాసు, సత్యనారాయణ పాల్గొన్నారు.

బాడంగి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. పాఠశాల స్థాయిలో 8,9,10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం తెంటు వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు ఎస్.సత్యనారాయణ, కె.ఈశ్వరరావు, డి.రమేష్, ఎస్.రామారావు, ఐవి.ప్రసాద్, రామారావు, గోవిందరావు పాల్గొన్నారు.

కొత్తవలస : మండలంలో పలు పాఠశాలల్లో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను శుక్రవారం నిర్వహించారు. ఏడు పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షకు 510 మంది హాజరైనట్లు జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ ఎల్.సత్యారావు తెలిపారు.



భోగాపురం హైస్కూల్లో చెకుముకి ప్రతిభా పరీక్షకు హాజరైన విద్యార్థులు



బొబ్బిలి.. చెకుముకి ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు, ఉపాధ్యాయులు

మూడో రోజుకు దీక్షలు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయొద్దని కోరుతూ చిన్నచామలాపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం మూడో రోజు కొనసాగాయి. కృషి విజ్ఞాన కేంద్ర బాధితుల పోరాట కమిటీ నాయకులు జి.తిరుపతిరావు మాట్లాడుతూ కెవికెకు తమ భూములు, కొండను తీసుకుంటే తమకు ఉరివేసినట్లేనని ఆందోళన వ్యక్తంచేశారు. భూములను తీసుకోబోమని నిర్ణయం చేసే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. శిబిరంలో వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, నాయకులు శంకర్రావు, నారాయణమ్మ, ఎరకమ్మ, రాములమ్మ, అప్పమ్మ, తౌడమ్మ, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రాజ్యపురస్కార్ శిక్షణ పూర్తిచేసిన ఆదిత్య విద్యాలయం స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ సూరిబాబు, హెచ్‌ఎం అమృత అభినందించారు. శిక్షణ పూర్తిచేసిన ఏడుగురు విద్యార్థులకు గవర్నర్ సంతకం చేసి సర్టిఫికెట్లు వస్తాయని డైరెక్టర్ తెలిపారు. వీటివల్ల చదువు, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. 15 ఏళ్లుగా శిక్షణకు విద్యార్థులను పంపిస్తున్నామని చెప్పారు.

ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు పరిశీలన



ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రావణి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని కొత్తపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోను, అరకాలగెడ్డ వీధి పాఠశాలలోనూ జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి ,డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పాల్గొన్నారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షలు ఏ విధంగా చేస్తున్నారు, రోగులకు ఇచ్చే సూచనలు సలహాలపై వైద్య సిబ్బంది ఏవిధంగా వివరిస్తున్నారో పరిశీలించారు. శిబిరాలు వద్ద స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారాల స్టాల్స్‌ను పరిశీలించారు. బాలామృతంతో చేసిన పదార్థాలను గమనించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పలువురికి అందజేశారు. అనంతరం మేయరు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పట్ల సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. ఇప్పటివరకు నగరంలో 18 వేలకు పైబడి ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్యపరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పట్టా ఆదిలక్ష్మి, కనకల నాగవల్లి, వైసిపి నాయకులు తోనంగి జగన్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల్లో వెలుగులు

ఎమ్మెల్సీ రఘురాజు

ప్రజాశక్తి-కొత్తవలస

సంక్షేమ పాలన ద్వారా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సిఎం కావాలని కోరుతూ రఘురాజు తిరుపతికి చేపట్టిన పాదయాత్ర మూడో రోజు శుక్రవారం కొత్తవలస మండలంలో కొనసాగింది. అడ్డూరివానిపాలెం బ్రిక్ ఇండస్ట్రీ నుంచి దేశపాత్రునిపాలెం వద్దనున్న ప్రజా సంకల్పయాత్ర వరకు సాగింది. పాదయాత్రలో భారీగా తరలివచ్చి పాల్గొన్నారు. ఎక్కడికక్కడ రఘురాజుకు ఘనస్వాగతం పలికారు. ఈ పాదయాత్రలో నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేపడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

మౌలిక సౌకర్యాల కల్పనలో విఫలం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర విఫలమయ్యారని సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు, గిరిజన సంఘం మండల కార్యదర్శి తామరాపల్లి సోములు విమర్శించారు. శుక్రవారం మండలంలో సమస్యలపై తహశీల్దార్ రామకృష్ణకు వినతి అందించారు. అనంతరం మండల కాంప్లెక్స్ ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడారు. మండలాన్ని రూ.406 కోట్లతో అభివృద్ధి చేశామని బస్సుయాత్ర సమావేశంలో ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ప్రకటించారని గుర్తుచేశారు. గుర్లగెడ్డ మినీ ప్రాజెక్టు, ఆంధ్ర హైలెల్ కాలువ, లోతుగెడ్డ నుంచి పైడిపర్తి రోడ్డు, గరుగుబిల్లి పంచాయతీ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని పలు సమావేశాలలో ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. ఆంధ్ర ప్రాజెక్టులో నాలుగేళ్లగా చేపపిల్లలు వేయకపోవడం వల్ల ఆంధ్ర, లోతుగెడ్డ పంచాయతీల్లోని గిరిజనులు ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వీటిని ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కృపారావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-గుర్ల

టిడిపి అధినేత చంద్రబాబునాయుడుతోనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ లభిస్తుందని ఆ పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం గుర్లలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ ఇన్‌ఛార్జులు ప్రతి ఓటరు వద్దకు 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించాలన్నారు. వచ్చే ఎన్నికలలో టిడిపి విజయానికి అందరూ కృషి చేయాలన్నారు.

అనంతరం బిసి సెల్ అధ్యక్షులు వెన్నె సన్యాసినాయుడు మాట్లాడుతూ ఓటరు జాబితాలను పరిశీలించి, తప్పులుంటే సరిచేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలరాజు కిరణ్ కుమార్, ఎంపిటిసి కోటేశ్వరరావు , ఐటిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగులపల్లి నారాయణరావు, ఎస్.సన్యాసినాయుడు, జి.రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



అన్న కేంటీన్‌లో ఆహారం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే లలితకుమారి

అన్న కేంటీన్‌కు 100 రోజులు పూర్తి

ప్రజాశక్తి-శృంగవరపు కోట

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కెబిఎ రాంప్రసాద్ సహకారంతో పట్టణంలో ఏర్పాటుచేసిన అన్న కేంటీన్‌కు శుక్రవారంతో 100 రోజులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కోళ్ల లలితకుమారి కేక్ కట్ చేశారు. అనంతరం ఆహారం వడ్డించారు. కేంటీన్ నిర్వహణకు విరాళాలు ఇచ్చిన దాతలు, బాధ్యతలు చూస్తోన్న వాలంటీర్లు, రుచికరమైన భోజనం అందిస్తున్న కేటరింగ్ యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

ట్యాబులు పంపిణీ

ప్రజాశక్తి-రేగిడి

స్థానిక ఎంఆర్‌సిలో వికలాంగుల విద్యార్థులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఎంఇఒలు ఎం.వరప్రసాదరావు, ఎరకయ్య, ఎంపిడిఒ కార్యాలయ సీనియర్ సహాయకులు నాగమణి శుక్రవారం ట్యాబులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఇఆర్ ఉపాధ్యాయులు యు.మహేశ్వరి, కేర్ టేకర్ అనురాధ ఉన్నారు.

ఉపాధి హామీ పనులకు ఆమోదం

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని సంకిలి గ్రామంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పనులు గుర్తించేందుకు సర్పంచ్ బి.పట్టాభి అధ్యక్షతన గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. రూ.45 లక్షలతో 12 పనులకు ఆమోదం తెలిపినట్లు ఎపిఒ ఎస్.హరినాథ్ తెలిపారు.. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్, ఇసి రామినాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ భారతి, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-తెర్లాం

తెర్లాం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం బొబ్బిలి సిఐ ఎస్.తిరుమల రావు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దీపావళి పండగ సందర్భంగా బాణసంచా తయారీ, విక్రయాలకు అనుమతులు లేవన్నారు. ఎక్కడికి తరలించినా, లైసెన్స్ లేనివారి విక్రయించినా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న సిఐ తిరుమలరావు



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన

టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి కోటలో టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం జరిగింది. కోటలో శుక్రవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయనను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, నాయకులు కలిసి రాజకీయ పరిస్థితులపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు ఐక్యంగా పని చేసేందుకు సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

డ్రోన్‌తో పురుగుల మందులు పిచికారీ చేయడంతో రైతులకు ఎంతో ఉపయోగమని వ్యవసాయాధికారి ఎ.నీలిమ అన్నారు. శుక్రవారం మండలంలోని రెల్లివలసలోని శ్రీ రామాంజనేయ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో డ్రోన్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గరుడ డ్రోన్ కంపెనీ సహకారంతో ఎఫ్‌పిఒలో ఉన్న రైతులకు ఆధునిక పద్ధతులను ఉపయోగించి వ్యవసాయం చేయడంపైన అవగాహన కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మహంతి శ్రీనివాసరావు, ఇజ్జురౌతు ఈశ్వరరావు, పారం ప్రొడ్యూసర్ సిఇఒ ఎ.ప్రభాకర్, ఎఇఒలు, విఎఎలు, ఎఫ్‌పిఒ రైతులు పాల్గొన్నారు.